# మన'వే'మన పద్యాలు

**ఆ. వె. దిక్కులేని వారి దీనత బాపిన**
**పురుషుడిహమునందె పూజ్యుడగును**
**పరమునందువాని భాగ్యమేమనవచ్చు?**
**విశ్వదాభిరామ వినురవేమ!**

**అర్థములు** : దీనత = కష్టము; బాపిన = పోగొట్టిన;
ఇహము = భూలోకము; పరము = పైలోకము.

**తాత్పర్యము** : దిక్కులేనివారిని ఆదుకొన్న మనిషికి ఈ లోకములోనే మంచి గౌరవము లభిస్తుంది. మరి పరలోకమునందు వేరే చెప్పాలా? అక్కడకూడా అతడు పూజ్యుడగుననేది నిజము. కావున పరలోకమునందున గౌరవము పొందడము అనేది, ఈ లోకములో మనము చేసే మంచి పనులమీద ఆధారపడుతుంది. ఈ లోకములో అందరి ఆదరాభిమానములు పొందిన వ్యక్తి పరలోకము గురించి ఆలోచించవలసిన పని లేదు.

**ఆ. వె. తనువు ఎవరిసొమ్ము తనదని పోషింప**
**ధనము ఎవరిసొమ్ము దాచికొనగ**
**ప్రాణమెవరి సొమ్ము పాయకుండుగ నిల్ప**
**విశ్వదాభిరామ వినురవేమ!**

**అర్థములు** : తనువు = శరీరము; పాయకుండగ = పోకుండా;
నిల్ప = నిలిపేందుకు.

**తాత్పర్యము:** శరీరము మనము సంపాదించినది కాదు. దానిమీద మనకు ఏ రకమైన అధికారములేదు. దానిని పోషించవలసిన బాధ్యత మాత్రమూ మన్పై ఉంది. అలాగే ధనము ఈశ్వరేచ్ఛవలననే మనకు సమకూరుచున్నది. దానిని దాచుకొనే అధికారము మనకులేదు. ప్రాణములు కూడా అంతే! ప్రాణమును కలిగి ఉండడములో మన ప్రమేయము ఏముంది? అది ఎలా వచ్చిందో, ఎప్పుడు పోతుందో మనకి తెలియదు. దానిని పోకుండా నిలపడము మనకు వశమౌతుందా?

*(ఇందులో కొంత భాగము స్వామి చిదాత్మానందగారి 'వేమన పద్యములు - అంతరార్థము' ప్రవచనములలో ఒంట పట్టించుకున్న సారాంశము. పూజ్య శ్రీ స్వామి చిదాత్మానంద గారికి ధన్యవాదములతో...)*

***వస్త్రావట్టిదె పోతావట్టిదె ఆశ ఎందుకంటా!***
***చేసిన కర్మము చెడని పదార్థము చేరును నీవెంట!!***
అన్న పెద్దలమాట చద్దన్నపు మూట.